# మరో జానిస

అమ్మాయి చాలా బావుందని అందరూ ఏకగ్రీవంగా అంగీకరించారు. తాంబూలాలు, పెళ్ళి వేడుకలు ఒకటొకటి త్వర త్వరగా అయిపోయాయి. అందాలరాశి అత్తవారింట్లో అడుగు పెట్టింది. పెదవి విప్పితే అలసిపోతుందని, కాలు కదిపితే కందిపోతుందని, క్షణ క్షణం కంటికి రెప్పలా కాపాడుకుంటూ, పూలల్లో పెట్టి పూజించేవాడు రామం.

నెల రోజులు గడిచాయి. అందాలరాశికి తెల్లారిన దగ్గర నుంచీ విసుగ్గానే వుంది ఆ రోజు.

"నేను మా వాళ్ళ యింటికి వెడతాను - ముద్దుముద్దుగా పడగ్గదిలో తన జీవిత భాగస్వామితో", అంది జానకి.

"అప్పుడేనా - అయినా నువ్వెడితే నే నెలా వుంటాను" గుండెలకి హత్తుకున్నాడు.

"కావాలంటే మీరూ రండి" రివ్వున గదిలోంచి బయటకెళ్ళిపోయింది జానీ.

*　　　　*　　　　*

అఫీసునించి ఇంటికొచ్చిన రామానికి కాఫీ గ్లాసు చెల్లె లందిస్తుంటే

చాలా చిరాకనిపించింది, గబ గబా తాగేసి, పది నిమిషాల్లో బయటకు దేరాడు రామం.

దగ్గర్లోనే వున్న అత్తవారిల్లు, మరీ దూరంగా అనిపించింది.

"జానీ" గుమ్మంలోకొస్తూనే పిలిచాడు.

మరదలు ఎదురొచ్చింది. "కూర్చోండి వస్తూంది."

రామం కూర్చున్నాడు - కూర్చున్నాడు - కూర్చున్నాడు!!

"ఇంట్లో లేదా" రామం లోపల గదిలో అడుగు పెట్టాడు. "ఊ - రండి" – సోఫాలో పడుకుని పత్రిక తిరగేస్తోంది జానీ. ఒక్క నిమిషం విస్తుపోయాడు. ఉన్నట్టుండి ఏమైంది!!

"నేను యింటికి రాను బాబూ!" గారాబంగా, దీర్ఘం తీసింది.

"అంటే?"–

"అదే - అబ్బ, ఆ ఇంట్లో అంతమందిలో నేనుండలేను."

రామం షర్టు బటన్సు సరిచేస్తోంది.

"అంటే?"....

"అదే - బోర్ – ఇలా చూడండి. ఇలా" జానీ చేతిలో ఉన్న పత్రిక వంక చూసాడు రామం.

సోఫాలో కూచున్న భార్య, భర్త - కాళ్ళ దగ్గర చిన్న కుక్క పిల్ల - పక్కగా చక్కని టెలిఫోన్ – ఫ్లవర్‌వాజ్ - రామం పక పకా నవ్వాడు.

"ఏమిటా నవ్వు – అవును ఇలా వుండాలి – చిలకా గోరింకల్లా."

"ఊ"–రామం ఎటో చూస్తున్నాడు. సమస్య అర్థమయిపోయింది. చిన్న వయసులో పెద్దఉద్యోగం తెచ్చుకున్న తెలివైన రామం విషయాన్ని గ్రహించటం కష్టం కాదు.

"ఏం చేద్దామంటావ్?"

"యూ సిల్లీ - నే చెప్పాలా?" రామం చెంపలు నిమిరింది. జుట్టు సవరించింది.

"ఊఁ - చెప్పండి" జానీ రామం ముఖంలోకి చూస్తోంది.

సహజంగా ఎవరినీ ఎదిరించలేడు. గట్టిగా మాట్లాడలేడు. అందాల రాశిని. అర్ధాంగిని ఏమంటాడు? రామం ఆ రాత్రి అక్కడే వుండి పోయాడు. తెల్లారి అక్కడ నుంచే ఆఫీసుకెళ్ళిపోయాడు.

* * *

"అదేమిటిరా – అలా చెప్పకుండా ఇద్దరు ఇంటికి రాకపోతే నేను, నాన్న మీ కోసం ఎంతసేపు ఎదురు చూస్తాం? ఎంతసేపు మీ కోసం భోజనం చేయకుండా కూచుంటాం?" ఇంట్లో అడుగు పెడుతుంటే తల్లి గొంతు.

"ఏది మీ ఆవిడ?"

రామం మాట్లాడలేదు.

ప్రస్తుతం వలలో చిక్కుకున్నాడు. బయటకు రావటం తేలిక కాదు. ఒక బంధం దూరం చేసుకుని, ఒక బంధం దగ్గర చేసుకోవాలి. ఏది, ఏది??

తనని ఈ స్థితికి తేవడానికి నాన్న పడ్డ కష్టాలు – తనకి తెలుసు. తన తమ్ముడికి చదువు, చెల్లెలికి పెళ్ళి చేయటంలో తనకున్న బాధ్యత తనకి తెలుసు.

కన్న ప్రేమకి దూరమవటమా?

భార్యకి దాసుడవటమా?

రాత్రంతా నిద్ర పట్టని రామం తెల తెలవారుతుండగా తండ్రి గదిలో అడుగు పెట్టాడు.

"నాన్న" – రామం గుండె దడ దడ లాడుతోంది.

"చెప్పు. ఏమిటి విశేషం?"

రామం మాట్లాడలేదు.

"ఈ నాటి వరకు పెరిగిన బంధాన్ని కట్ట కట్టి గుండెల్లో అట్టడుగున పడేయాలనుకుంటున్నాను."

అందమైన గూడుకట్టుకుని ఎగిరిపోయి బతికేయాలనుకుంటు న్నాను - రామం గుండెదాటి బయటికి రాలేదు ఈ మాటలు.

"ఏమిటో చెప్పు" - తండ్రి రామం ముఖంలోకి చూసాడు. ముఖం పక్కకు పెట్టుకునే ఉన్న విషయం చెప్పాడు రామం. తండ్రి మాట్లాడ లేదు. రామం మాట్లాడలేదు. గదిలో నిశ్శబ్దం భయమేస్తోంది....

"నీ యిష్టం" - ఒక్కటే మాట తండ్రి గొంతు నుంచి.

రామం ముఖం వెలవెలపోయింది. ఇది మరీ బాధగా వుంది. అయినా వారంరోజులు తిరక్కుండానే రామం వేరుపడిపోయాడు.

రంగు రంగు కర్టెనులు, పూల పూల దుప్పట్లు, అందమైన సోఫాలు - అలంకరించిన ఇంట్లో అడుగుపెడుతున్నా ఒక్కసారి భయమేసింది రామానికి.

*　　*　　*

వారం వారం తండ్రిని చూడడానికి వచ్చేవాడు మొదట్లో రామం. నెమ్మదిగా ఏ నెలకో ఓసారి రావటం మొదలైంది.

"ఇద్దరం వెడదామా" - నసిగాడు ఓ సాయంత్రం.

"అబ్బ. బోర్ - మీరెళ్ళండి."

"నువ్వు ఒక్కర్తివీ ఎలా వుంటావ్ - నేనూ వెళ్ళనులే" సిగరెట్టు ముట్టించాడు. తమ్ముడికి ఫీజు కట్టడానికి డబ్బు తక్కువైతే, తన స్నేహితుడు అప్పివ్వడం చూస్తూనే ఊరుకున్నాడు. చెల్లెలు పెళ్ళయితే అందరితోపాటు వెళ్ళి వచ్చేసాడు... ఎక్కడో గుండె పట్టుకుంటోంది! - కానీ ఆ రోజు రామం అలా అరుస్తాడని ఊహించని జానీ విస్తుపోయింది.

"నీకెంత బానిసనయినా మనిషినే - మరిచిపోకు - నా తండ్రి పుట్టినరోజు కెళ్ళడానికి నీ పర్మిషన్ కావాలా" - జానీ ఏదో అనబోయి నోరు వెంటనే మూసేసుకుంది. రామం మెట్లుదిగి గబగబా వెళ్ళిపోతుంటే, చూస్తూ నిలుచుంది జానీ చాలా సేపు.

*　　*　　*

"మమ్మీ - ఇది విషయం" - ముక్కు తుడుచుకుంది జానీ.

"మరేం ఫరవాలేదు - సాయంత్రానికి వచ్చేస్తాడు చూడు. నిన్నాదలి అతనేం చేస్తాడూ" - సిగపిన్నులు సర్దుకుంది తల్లి.

వారం రోజులయింది. రామం ఆఫీసు నుంచి తిన్నగా తండ్రి ఇంటికెడుతున్నాడు. ఆ రోజు ఆఫీసుకొచ్చిన జానీని చూసి ఆశ్చర్య పోయాడు రామం.

"ఏమిటిలా వచ్చావ్."

"మాట్లాడాలి."

రామం సెలవు చీటీ ఇచ్చేసి బయటకొచ్చేసాడు.

హోటల్లో కూచున్నారు.

"మా వాళ్ళేం అంత గతిలేనివాళ్ళు కారు."

"అంటే" -

"అదే మా అమ్మ చెప్పమంది - మీరక్కడ నేనిక్కడ బాగ లేదు - ఏదో తేల్చుకుందామని" - అందంగా వుండే జానీ కళ్ళు ఎరుపెక్కటంతో మరీ అందంగా కనిపిస్తోంది.

"విడిపోదామనా" రామం నవ్వాడు.

"అవును - మనసులు కలవకుండా...." చిన్న కర్చీఫ్‌తో కళ్ళొత్తు కుంది జానీ.

"సాయంత్రం ఇంటికొచ్చేయ్" -

"మీరే రండి" - చక్కున లేచి వెళ్ళిపోయింది జానీ.

*　　　*　　　*

"మీ మామగారొచ్చారు" - తండ్రి గదిలో నుంచి అన్నాడు.

"ఏమంటాడు?"

"ఏమో - నాకేం అర్థంకాలే."

"కానీ ఒక్కమాట విను. సాయంత్రం వెళ్ళి ఆ అమ్మాయిని తీసుకుని నీ యింటికి నువ్వెళ్ళు" - తండ్రి గొంతు గంభీరమైంది. మరో మాటకి అవకాశం లేదు. రామం గొంతు పూడింది!

అంతే - అదే రామం జీవితంలో మలుపు.

* * *

కాలం గబగబా పరిగెడుతోంది.

రామం జుట్టులో ఒకటొకటె తెల్ల వెంట్రుకలు కనిపిస్తున్నాయి.

"బజారు వెడదామా?"

"నీ యిష్టం."

"సినిమాకెడదాం."

"నీ యిష్టం."

"అన్నం తినండి."

"నీ యిష్టం."

"డాడీ, మీకు యిష్టం లేకపోయినా రావాల్సిందే - మమ్మీకి కోపమొస్తుంది - పదిహేనేళ్ళ రాజీ మాటలకి.

"మీ యిష్టం" - రామం షర్టు తొడుక్కుని సిద్ధమవుతున్నాడు.

"మీకు తెలియదు - ఊరుకోండి" జానీ కూతురు పెళ్ళి విషయాలు తనే మాట్లాడుతుంది.

"ఊ - సరే" - రామం చెప్పులు తొడుక్కుని జానీ వెంట నడుస్తున్నాడు.

"జుట్టుకు రంగేసుకోవోయ్" అంటున్నారు స్నేహితులు. నిజంగానే రంగు వేసుకోవాలని తనకీ వుంది....కానీ,

"డై చాలా ఖరీదయిపోయింది. రంగు అనవసరం" జానీ అంది, పెదాలకు లిప్‌స్టిక్ పూసుకుంటోంది అద్దం ముందు నిలబడి.

నీ ఇష్టం. "నిజమే - రంగు చాలా ఖరీదయిపోయింది వేసుకోను" ఆ అద్దంముందే నిలబడి తల దువ్వుకున్నాడు రామం.

*　　　*　　　*

ఎప్పుడైనా ఒంటరిగా డాబామీద చల్లగాలికి తిరుగుతుంటే ఎన్నో ఏళ్ళనాడు, "నీ యిష్టం" అని తండ్రి అన్న మాట, ఆ గంభీరమైన గొంతు చెవికి వినిపిస్తుంది రామానికి. ఆ నిముషం ఓ దీర్ఘమైన నిట్టూర్పు అలా గాలిలో కలిసిపోతుంది. అంతే!!

* [ఆంధ్ర సచిత్ర వారపత్రిక, 11-17 జూలై, 1986] *